

**నైపుణ్యాభివృద్ధిరస్తు!**
స్కిల్ హబ్ సెంటర్లు యువతకు దారి చూపిస్తున్నాయి. కావాల్సిన కొలువు అందిస్తున్నాయి. - 8లో



**దారుణ హత్య**
మొగదాలపాడులో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. చిల్లంగి అనుమానంతో చంపేసినట్లు భావిస్తున్నారు. - 8లో

**శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు**

| మండలం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆమదాలవలస | 43° | 29° |
| ఇచ్ఛాపురం | 44° | 30° |
| పాతపట్నం | 43° | 29° |
| శ్రీకాకుళం | 44° | 29° |

## న్యూస్‌రీల్

### ఈసీసీఈలో 41 మందికి ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ ఎడ్యుకేషన్ కోర్సులో ప్రవేశాలకు గురు, శుక్రవారాలు కౌన్సెలింగ్ నిర్వహించారు. 50 సీట్లకు 41 మందికి ప్రవేశాలు జరిగాయి. ఆరు నెలల పాటు ఆన్‌లైన్‌లో క్లాస్‌వర్క్ నిర్వహించి, అనంతరం పరీక్షలు నిర్వహిస్తామని కోర్సు సమన్వయకర్త డాక్టర్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

### వాక్ ఇన్ ఇంటర్వ్యూలు వాయిదా

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో ఈ నెల 11వ తేదీన జరగవల్సిన వాక్ ఇన్ ఇంటర్వ్యూలు 17వ తేదీకి వాయిదా వేసినట్లు రిజ్రస్టార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. విశ్వవిద్యాలయంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్, బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ పోస్టులకు 17న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. నిబంధనలు మేరకు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంటుందని వివరించారు.

### నౌపడలో గాలివాన బీభత్సం



గాలివానకు కూలిన షెడ్

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడలో శుక్రవారం మధ్యాహ్నం గాలివాన బీభత్సం సృష్టించింది. అకస్మాత్తుగా వచ్చిన గాలులకు పలు చోట్ల చెట్లు నేలకూలాయి. దాదాపు పావు గంట పాటు వడగళ్ల వాన కురిసింది. రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. గ్రామానికి చెందిన వృద్ధురాలు గుజ్జు బూల్లమ్మ రేకుల షెడ్డు కూలిపోయింది. అలాగే పలికిల రాజేశ్వరికి చెందిన వంటగదిపై భారీ తాటిచెట్టు పడి గది నేలమట్టమైంది. ఎల్తూరు సురేష్‌కు చెందిన రేకుల షెడ్డు గాలికి ఎగిరిపోయింది. సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

### నేటితో ముగియనున్న ఏపీ పీజీ సెట్

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల ఆరో తేదీ నుంచి జరుగుతున్న ఏపీ పీజీసెట్ -2023 పరీక్షలు శనివారంతో ముగియనున్నాయి. జిల్లాలో రెండు ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షలకు శుక్రవారం ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో మూడు షిఫ్టుల్లో జరగ్గా, మొదటి షిఫ్టులో 90కి 85, రెండో షిఫ్టులో 101 కి 86, మూడో షిఫ్టులో 8 మందికి ఏడుగురు హాజరయ్యారు. చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరగ్గా మొదటి షిఫ్టులో 66 కి 65 మంది, రెండో షిఫ్టులో 120కి 108 మంది హాజరయ్యారు.

### న్యాయవాదులు ఐక్యంగా ఉండాలి



మాట్లాడుతున్న శాంతకుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవాదులు ఐకమత్యంతో మెలిగినప్పుడే దాడులను అరికట్టవచ్చునని ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శాంతకుమార్ అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న శ్రీకాంత్ చింతల రాజ్యాంగ నైతికత- పెను సవాళ్లు అనే అంశంపై మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అధ్యక్షుడు శాంతకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ న్యాయవాదులకు రూ.15వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే సెక్షన్ 41 (ఎ) సీఆర్ పీసీ రద్దు చేసేందుకు, న్యాయవాదుల హక్కుల కోసం ఐఎల్‌ఏ నిరంతరం పోరాటం చేస్తుందని చెప్పారు. ఐఎల్‌ఏ ఉత్తర కోస్తా జిల్లాల కో-ఆర్డినేటర్ మంతిన అప్పారావు మాట్లాడుతూ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ కోసం ఐఎల్‌ఏ కలసి పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జి.సురేష్‌బాబు, గోవిందరావు, వాన కృష్ణచంద్, అన్నెపు భువనేశ్వరరావు, ఆఫీసునాయుడు, ఎ.కృష్ణంరాజు, జిల్లా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి.చంద్రమౌళి, కార్యదర్శి చిన్నారావు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# ఇక ఇంటికే పౌష్టికాహారం





గర్భిణులకు వైఎస్సార్ పోషణ కిట్‌లను అందజేస్తున్న దృశ్యం

- జూలై 1 నుంచి అమలు
- వైఎస్సార్ సంపూర్ణ పోషణతో మహిళల ఆరోగ్యానికి పెద్దపీట
- జిల్లాలో 18 ప్రాజెక్టుల ద్వారా అమలు

శ్రీకాకుళం అర్బన్: సవాలక్ష సమస్యల మధ్య మధ్యాహ్నం పూట అంగన్‌వాడీలకు రాలేకపోతున్న గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం చల్లటి కబురు అందించింది. అంగన్‌వాడీ కేంద్రాలకు దూరంగా ఉండి ఆయా కేంద్రాలకు రాలేని వారికి జూలై 1వ తేదీ నుంచి ఇంటికే పౌష్టికాహార కిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించింది. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం జగనన్న కిట్ల ద్వారా మహిళల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తోంది.

జిల్లాలో శ్రీకాకుళం అర్బన్, గార, ఎస్‌ఎం పురం, ఎచ్చెర్ల, రణస్థలం, పొందూరు, ఆమదాలవలస, బూర్జ, కొత్తూరు, నరసన్నపేట, సారవకోట, పాతపట్నం, సోంపేట, మందస, కాశీబుగ్గ, టెక్కలి, కోటబొమ్మాళి, ఇచ్ఛాపురం, తదితర 18 ప్రాజెక్టుల్లో 2,759 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న 11, 384 మంది గర్భిణులకు, 14, 690 మంది బాలింతలకు ఈ పథకం ద్వారా ప్రతి రోజూ సంపూర్ణ పోషకాహారం అందిస్తున్నారు. వైఎస్సార్ కిట్‌లో భాగంగా కిలో రాగిపిండి, కిలో అటుకులు, పావుకిలో బెల్లం, పావు కిలో ఖర్జూరం, పావు కిలో చెక్కీలు,



అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఇస్తున్న దృశ్యం(ఫైల్)

పాలు, గుడ్లు ఉండే కిట్‌లు గర్భిణులకు ఇప్పటికే అందిస్తున్నారు. ఇప్పటి వరకూ గర్భిణులు, బాలింతలు కేంద్రానికి వస్తే ఆకుకూర పప్పు, పాలు, కోడి గుడ్లు ఆహారంగా వండి పెడుతున్నారు. అయితే జూలై నెల 1వ తేదీ నుంచి ప్రతి గర్భిణీకి, బాలింతలకు 3కేజీల బియ్యం,1కేజీ కందిపప్పు, 450 గ్రాముల ఆయిల్ ప్రకారం 25 గుడ్లు, 5లీటర్లు పాలు, వైఎస్సార్ కిట్(1కేజీ రాగిపిండి, 1కేజీ జొన్నపిండి, 1కేజీ అటుకులు, 250 గ్రాముల ఎండు కర్జూరం, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల వేరుశెనగ చెక్కీ) కలిపి వస్తువులను ఇంటికి వచ్చి ఇవ్వనున్నారు.

**దూరం భారమై..**

కొన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు దూరంగా ఉండడంతో గర్భిణులు, బాలింతలు మధ్యాహ్నం సమయంలో అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేకపోతున్నారు. ఈ విషయం అంగన్‌వాడీ అధికారులకు తెలియడంతో జూలై 1వ తేదీ నుంచి పౌష్టికాహారాన్ని వారి ఇంటి వద్దకే పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నిర్ణయంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మహిళల్లో రక్తహీనత తగ్గించడం, వ్యాధి నిరోధకశక్తి సహజంగా పెంచేందుకు వైఎస్సార్ సంపూర్ణ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రతి నెలా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు హెచ్‌బీ పరీక్ష చేసి రక్తహీనత ఉన్నవారిని గుర్తిస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లు హోం విజిట్ ద్వారా తల్లీ, పిల్లల ఆరోగ్యం తెలుసుకుని హెల్త్ వర్కర్ ద్వారా ఐరన్, కాల్షియం మాత్రలను అందించే ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

**సంతోషకరం**



ఇప్పటి వరకూ అంగన్‌వాడీ కేంద్రంలోనే పౌష్టికాహారం వండి వడ్డించేవారు. జూలై 1వ తేదీ నుంచి వైఎస్సార్ పౌష్టికాహారం నేరుగా ఇంటికే తెచ్చి ఇచ్చేలా ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. మాలాంటి వారికి ఎంతో ఉపయోగకరం.
– అరసాద స్వాతిశ్రీ, బాలింత

**పకడ్బందీగా అమలు చేస్తాం**



వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని జిల్లాలో జూలై 1వ తేదీ నుంచి మరింత పటిష్టంగా అమలు చేస్తాం. జిల్లా వ్యాప్తంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్యంపై దృష్టి సారిస్తున్నాం. ఇప్పటికే మహిళల్లో రక్తహీనతతో బాధపడేవారిని గుర్తించి వారికి పౌష్టికాహారం, మాత్రలు అందజేస్తూ రక్తహీనతను అధిగమించేందుకు కృషిచేస్తున్నాం.
– జి.జయదేవి, ఐసీడీఎస్ పీడీ

# హర్షాతిరేకం



ఎన్నో ఏళ్ల కల నిజమైనందుకు కాంట్రాక్టు ఉద్యోగులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మనసారా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఈ నిర్ణయంతో తమ తలరాతలు మారాయని, కుటుంబ స్థితిగతులు కూడా మారుతాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న నాయకుడిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ నిర్ణయంపై జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

**జీవితాంతం రుణపడి ఉంటాం**



సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయం మా తలరాతలు మార్చింది. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.
– ఎం.సూర్యనారాయణ, కాంట్రాక్టు హిస్టరీ లెక్చరర్, కోటబొమ్మాళి ప్రభుత్వ జూనియర్ కాలేజీ

**చెప్పారంటే చేస్తారు..**



ఏళ్ల తరబడి ప్రభుత్వాలు మమ్మల్ని పట్టించుకోలేదు. సీఎం వైఎస్ జగన్ మాత్రం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం. – పాగోటి నారాయణరావు, కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ కన్వీనర్, సారవకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల, సారవకోట

**ఆదుకున్నారు**



సీఎం తీసుకున్న నిర్ణయం మా కుటుంబ స్థితినే మార్చేసింది. మా లాంటి వారిని ఆపద్బాంధవుడిలా సీఎం వైఎస్ జగన్ ఆదుకున్నారు.
– ఎస్.జగదీష్, కాంట్రాక్టు జువాలజీ లెక్చరర్, కోటబొమ్మాళి ప్రభుత్వ జూనియర్ కాలేజ్

**ఎవరూ చేయని సాహసం**



జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో సుమారు 20 ఏళ్లుగా ల్యాబ్ టెక్నీషియన్‌గా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నాను. అప్పటి నుంచి ఎప్పుడు జీవితాలు మెరుగు పడతాయోనని తోటి ఉద్యోగులతో కలసి అనుకునేవాళ్లం. ఇప్పుడు వైఎస్ జగన్ ఎవరూ చేయని సాహసం చేసి మా జీవితాల్లో వెలుగులు నింపారు.
– యాళ్ల నాగభూషణరావు, ల్యాబ్ టెక్నీషియన్, సారవకోట పీహెచ్‌సీ

**నిరీక్షణ జగనన్నతో ఫలవంతమైంది**



కాంట్రాక్టు అధ్యాపకుల నిరీక్షణ జగనన్నతో ఫలవంతమైంది. నాకు పెళ్లి కాకముందు ఉద్యోగంలో చేరాను. ఇప్పుడు నా పిల్లలు కూడా పెద్దవారైపోయారు. ఇప్పటికైనా నాకు రెగ్యులర్ కావడం సంతోషంగా ఉంది. నిబంధనలకు అనుగుణంగా కొద్దిమేరలో ఉన్న అధ్యాపకులను పరిశీలిస్తే బాగుంటుంది. – హనుమంతు రామ్మోహనదొర, కాంట్రాక్ట్ లెక్చరర్స్ జిల్లా అధ్యక్షుడు, పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల

# ‘వయోవృద్ధుల సంస్థలకు అనుమతి ఉండాలి’

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం, 2007 ప్రకారం వృద్ధాశ్రమాలు నిర్వహించడానికి అనుమతులు తప్పనిసరిగా ఉండాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకుడు కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకున్న వారికి నిబంధనల మేరకు అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. గుర్తింపు లేని వృద్ధాశ్రమాల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పూర్తి సమాచారం కోసం 08942-240519 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

# ఎండ తీవ్రతకు 30 గొర్రె పిల్లలు మృతి



ఎండ తీవ్రతకు మరణించిన గొర్రె పిల్లలు

మందస: మండలంలోని మఖరజోల గ్రామం వద్ద ఎండ తీవ్రతకు 30 గొర్రెలు మృతి చెందాయి. నందిగాం మండలంలోని పాతులూరు, రథజన బొడ్డపాడు, మదనాపురం గ్రామాలకు చెందిన బుడ్డ రామయ్య, ఈది గవరయ్య, నమ్మి లచ్చయ్యలు గొర్రెలను ఈ ప్రాంతంలో మంద వేస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం మఖరజోల గ్రామం పొలాల్లో గొర్రెలను మేపుతూ పిల్లలను గూట్లో ఉంచారు. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రతకు 30 గొర్రె పిల్లలు మరణించాయి. గొర్రెలు తోలుకుని తిరిగి వచ్చి చూడగా మరణించిన గొర్రె పిల్లలు కనిపించడంతో వారంతా కన్నీరుమున్నీరయ్యాయి.

# క్రీడలతో ఉజ్వల భవిష్యత్

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడాకారులు క్రీడలను సాదాసీదాగా కాకుండా, ఒక ప్యాషన్‌గా తీసుకుని ముందడుగు వేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పేర్కొన్నారు. రాష్ట్రం ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, స్పోర్ట్స్ కోటాతో క్రీడాకారులకు ఉజ్వలమైన భవిష్యత్ లభిస్తుందని ఆయన అన్నారు. 2023-24 ఏడాదికిగాను ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. శ్రీకాకుళం నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో జరిగిన ఈ ముగింపు కార్యక్రమానికి జేసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉన్నత చదువులు, ఉద్యోగాల సమయంలో స్పోర్ట్స్ కోటా పక్కాగా అమలవుతోందని అన్నారు. క్రీడాకారులకు లభించే గౌరవం, గుర్తింపు ఇంకెవరికీ ఉండవన్నారు. జిల్లాలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు జరిగిన తీరును డీఎస్‌ఏ సీఈఓ బీవీ ప్రసాదరావు వివరించారు. అనంతరం క్రీడాకారులకు, కోచ్‌లకు ప్రశంసా పత్రాలు, సమ్మర్ క్యాంప్‌ల పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఇటీవల జరిగిన ఏపీ సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా కబడ్డీ, హ్యాండ్‌బాల్ జట్ల క్రీడాకారులను అభినందించారు. ట్రోఫీలను బహూకరించారు. కార్యక్రమానికి జిల్లా డీఎస్‌ఏ చీఫ్ కోచ్ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, నెహ్రూ యువ కేంద్రం యూత్ ఆఫీసర్ కె.వెంకట్ ఉజ్వల్, పీఈటీ సంఘ ప్రతినిధులు వై.పోలినాయుడు, ఎమ్మెస్సీ శేఖర్, కె.మాధవరావు, సాధు శ్రీను, కోచ్‌లు, డీఎస్‌ఏ సిబ్బంది హాజరయ్యారు.



సీఎం కప్ ట్రోఫీలో విజేతగా నిలిచిన జిల్లా కబడ్డీ క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న జేసీ నవీన్

# ఎస్‌ఈబీకి సొంతిళ్లు!



అద్దె భవనంలో సెబ్ జేడీ కార్యాలయం

- స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను బలపరిచేలా ప్రభుత్వ చర్యలు
- శ్రీకాకుళం జిల్లా సెబ్ కార్యాలయం సహా మూడు స్టేషన్లకు ప్రభుత్వ స్థలం గుర్తింపు
- మరో ఎనిమిది స్టేషన్లకు స్థలాలు గుర్తించడంలో నిమగ్నమైన అధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ)ని బలపరిచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఎస్‌ఈబీకి సొంత భవనాలు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటోంది. ఒకప్పటి ఎక్సైజ్ పోలీసు శాఖ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఎస్‌ఈబీగా రూపాంతరం చెందింది. జిల్లా సెబ్ ప్రధాన కార్యాలయం సహా 14 స్టేషన్లు అద్దె(పాత) భవనాల్లోనే సెబ్ పోలీసులు కష్టతరంగా విధులు నెట్టుకొచ్చారు. ఇప్పుడు 12 స్టేషన్లకు ప్రభుత్వ స్థలాలను సమకూర్చాలని కలెక్టర్‌కు, ప్రభుత్వానికి జిల్లా సెబ్ జాయింట్ డైరెక్టర్ (ఎస్పీ) విజయ నాగమణికంత ప్రతిపాదన పంపడంతో.. కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత తహసీల్దార్లు, మూడు రెవెన్యూ డివిజన్ల అధికారులు ప్రభుత్వ స్థలాలు గుర్తించి కేటాయించడంలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే శ్రీకాకుళంలో రెండు వేల గజాలకు గాను వెయ్యి గజాలు, నరసన్నపేట, ఇచ్ఛాపురం, పాతపట్నంలో చెరో వెయ్యి గజాలు గుర్తించారు. పాతపట్నంలో డాక్యుమెంట్ వెరిఫికేషన్ పూర్తిచేయాల్సి ఉంది. మరో వారం పదిరోజుల్లో స్థల కేటాయింపు జరుగుతుంది. మిగతా ఎనిమిదింటిలో పలాస సెబ్ స్టేషన్‌కు 1500, మిగతా వాటికి వేయి గజాలు చొప్పున ప్రభుత్వ స్థలం గుర్తించాల్సి ఉంది. కొత్తూరు లాఅండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ కొత్త భవంతిలోకి మారడంతో ఎస్పీ జీఆర్ రాధిక చొరవతో కొత్తూరు సెబ్ స్టేషన్, పీఎస్ పాత భవంతి (అద్దె కాదు)లోకి మారింది.



శ్రీకాకుళం సెబ్ ప్రధాన కార్యాలయానికి రూరల్ పరిధిలో స్థలం గుర్తించిన అధికారులు

**ప్రతిపాదనలు పంపించాం**



ఎక్సైజ్ పోలీస్ శాఖగా ఉన్న నాటి నుంచి ఇప్పటివరకు పాత అద్దె భవనాల్లోనే విధులు నిర్వర్తిస్తున్నాం. ఇప్పుడు అన్ని సెబ్ స్టేషన్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయా లని ప్రభుత్వం నిర్ణయించింది. సంబంధిత తహసీల్దార్లు, ఆర్డీవోలు వారి పరిధిలో ఇప్పటికే నాలుగు గుర్తించారు. వారం పది రోజుల్లో కేటాయింపు జరుగుతుంది. మరో ఎనిమిదింటికి ప్రభుత్వ స్థలం ఆరేడు సెంట్లు దొరుకుతుండటంతో స్థలాభావం ఏర్పడుతుందనే ఉద్దేశంతో వేచి చూస్తున్నాం. మరో నెలన్నర రోజుల్లో అన్నింటికి స్థల కేటాయింపు జరుగుతుందనే ఆశాభావంతో ఉన్నాం.
– విజయ నాగమణికంత, సెబ్ జాయింట్ డైరెక్టర్ (ఎస్పీ), శ్రీకాకుళం

**డివిజన్ల వారీగా..**

శ్రీకాకుళం జిల్లా ఎస్‌ఈబీ అధికారి కార్యాలయం ప్రస్తుతం ఫరీదు పేటలో ఉంది. దీంతో పాటు శ్రీకాకుళం సెబ్ స్టేషన్, శ్రీకాకుళం సెబ్ కార్యాలయాలు మూడింటికీ కలిపి రెండు వేల గజాలు కావాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం వెయ్యి గజాలు గుర్తించారు. కలెక్టర్‌కు నివేదిక పంపించారు. అలాగే నరసన్నపేట సెబ్ స్టేషన్‌కు వెయ్యి గజాలు ప్రతిపాదించగా.. వెయ్యి గజాలు గుర్తించారు. కలెక్టరేట్‌కు నివేదించారు. రణస్థలం సెబ్‌స్టేషన్‌కు వెయ్యి గజాలు ప్రతిపాదించగా.. స్థలాన్ని గుర్తించాల్సి ఉంది. అలాగే ఆమదాలవలస, పొందూరు సెబ్‌స్టేషన్లకు కూడా చెరో వెయ్యి గజాలు ప్రతిపాదించగా.. స్థలాలను గుర్తించాల్సి ఉంది. పలాస డివిజన్‌లోని ఇచ్ఛాపురం సెబ్ స్టేషన్‌కు వెయ్యి గజాలు ప్రతిపాదించారు. సంబంధిత స్థలాన్ని గుర్తించి కలెక్టరేట్‌కు నివేదించారు. సోంపేట, పలాస సెబ్‌స్టేషన్లకు స్థలం గుర్తించాల్సి ఉంది. టెక్కలి రెవెన్యూ డివిజన్‌లో కోటబొమ్మాళి, కొత్తూరు, టెక్కలి, పాతపట్నం సెబ్‌స్టేషన్లకు ఇంకా స్థలాలు గుర్తించాలి.

### ● వార్షికోత్సవం

శ్రీకాకుళంలోని నానుబాలవీధిలో వేంచేసిన విజయదుర్గ అమ్మవారి ఆలయ 17వ వార్షికోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం సహస్ర పుష్పార్చన, కుంకుమార్చనలు నిర్వహించారు. 12 నుంచి రాజశ్యామల యాగ మహోత్సవం ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.
– శ్రీకాకుళం కల్చరల్



### ● పుష్పయాగ మహోత్సవం

శ్రీకాకుళంలోని డీసీసీబీ కాలనీలో కొలువై ఉన్న భూ సమేత వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యా ణోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుష్పయాగ మహోత్సవం జరిగింది. ఆలయ అర్చకులు చామర్తి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో ముందుగా చూర్ణోత్సవం, మహాపూర్ణాహుతి, అవభృద స్నానం నిర్వహించారు. అనంతరం స్వామికి అన్ని రకాల పుష్పాలతో నివేదన చేశారు. సాంస్కృతిక ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దుంపల సన్యాసిరావు, భక్తులు పాల్గొన్నారు.
– శ్రీకాకుళం కల్చరల్



### ఏపీఆర్‌డీసీ సెట్‌లో అచ్యుతరావుకు ఫస్ట్ ర్యాంకు



అచ్యుతరావు

నరసన్నపేట: ఏపీఆర్‌డీసీ ప్రవేశ పరీక్షలో కింజరాపు అచ్యుతరావు రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారని స్థానిక సంపత్ సాయి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గణపతిరావు తెలిపారు. పోలాకి మండలం కింజరాపు వానిపేటకు చెందిన అచ్యుతరావు తల్లిదండ్రులు వ్యవసాయకూలీలు. ఏపీఆర్‌డీసీలో 119 మార్కులతో తనకు మొదటి ర్యాంకు రావడం ఆనందంగా ఉందని అచ్యుతరావు అన్నారు.

## క్లుప్తంగా

### ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన చౌదరి పురుషోత్తమనాయుడు

శ్రీకాకుళం అర్బన్: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిస్థాయిలో చొరవ చూపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏపీ ఎన్‌జీఓ సంఘం తరఫున కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నట్లు ఏపీ ఎన్‌జీఓ సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు తెలిపారు. ఈ మేరకు సంఘం తరఫున ముఖ్యమంత్రిని విజయవాడలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలసినట్లు పేర్కొన్నారు.

### నీలమణి దుర్గ సన్నిధిలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి తుషారావుకు జ్ఞాపికను అందజేస్తున్న చైర్మన్ ఈశ్వరరావు

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణి దుర్గ అమ్మవారిని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జి.తుషారావు కుటుంబ సభ్యులతో శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణకుంభంతో న్యాయమూర్తికి ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తికి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వాసుదేవరావు, ఎస్ఐ మహమ్మద్ యాసీన్, ఏజీపీ జి.సూర్యం, ఎంపీటీసీ కె.యరకయ్య, ఆలయ గుమస్తా సుదర్శన్, అర్చకులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### విశ్రాంత హోంగార్డుకు సన్మానం



హోంగార్డు రాజారావు దంపతులను సత్కరిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం హోంగార్డుగా పనిచేసి శుక్రవారం రిటైరైన ఎస్.రాజారావును ఎస్పీ జీఆర్ రాధిక సన్మానించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయానికి రాజారావు దంపతులను, కుటుంబాన్ని ఆహ్వానించి దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. తక్షణ ఆర్థికసాయం కింద రూ. 5 వేల నగదు చెక్కును ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో రాజారావు నిబద్ధతతో పనిచేశారని, కేటాయించిన అన్ని విధులూ చక్కగా నిర్వర్తించారన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి సహాయం అవసరమైనా జిల్లా పోలీసు శాఖ అండగా ఉంటుందని, ఆరోగ్యం సరిగా చూసుకోవాలని రాజారావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి సి.హెచ్.గోపినాథ్, హోంగార్డు ఆర్ఐ బి.ప్రదీప్, ఉమామహేష్ పాల్గొన్నారు.

# నైపుణ్యాభివృద్ధిరస్తు



డీఎల్‌టీసీ శ్రీకాకుళంలో కంప్యూటర్ శిక్షణలో నైపుణ్యాలు తెలుపుతున్న కోఆర్డినేటర్

- ఉద్యోగార్థులకు ఉపయోగపడుతున్న స్కిల్‌హబ్ సెంటర్లు
- రెండు విడతల్లో 346 మందికి శిక్షణ
- 219 మందికి ప్లేస్‌మెంట్లు
- 8 నియోజకవర్గ కేంద్రాల్లో స్కిల్ హబ్ సెంటర్లు



నరసన్నపేట స్కిల్ హబ్ కేంద్రంలో శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువతీ యువకులు

నరసన్నపేట: స్కిల్ హబ్ సెంటర్లు సామాన్యుల కలలు నెరవేరుస్తున్నాయి. శిక్షణ తీసుకోవడానికి ఆర్థిక స్తోమత లేక, కొత్త ఉద్యోగాల అన్వేషణకు దారి తెలియక ఇబ్బంది పడుతున్న దిగువ, మధ్య తరగతి యువతకు ఈ సెంటర్లు సాయం చేస్తున్నాయి. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గ కేంద్రాల్లో ప్రభుత్వం ఈ స్కిల్‌హబ్ సెంటర్లను ఏర్పాటు చేసింది. గ్రామీణ యువతకు ఆసక్తి ఉన్న రంగంలో నైపుణ్యం కల్పించి వారికి తగిన విధంగా శిక్షణ ఇచ్చేందుకు ఇవి ఉపకరిస్తున్నాయి.

**219 మందికి ప్లేస్‌మెంట్లు**

జిల్లాలో ఫిబ్రవరి 16 నుంచి స్కిల్ హబ్ కేంద్రాలు నడుస్తున్నాయి. ఇప్పటి వరకూ రెండు విడతలుగా శిక్షణ పూర్తి చేశారు. వీటిల్లో 346 మంది శిక్షణ పొందగా 214 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. వీరు విశాఖపట్నంతో పాటు ఇతర పట్టణాల్లో పలు కంపెనీల్లో పనిచేస్తున్నారు. నెలకు రూ. 12వేలకుపైబడి వేతనం అందుకుంటున్నారని నైపుణ్యాభివృద్ధి శాఖ జిల్లా అధికారులు అంటున్నారు. ప్రస్తుతం 8 కేంద్రాల్లో 241 మంది మూడో విడత శిక్షణ పొందుతున్నారు.

**10 కేటగిరీల్లో శిక్షణ..**

స్కిల్ హబ్ కేంద్రాల్లో ప్రస్తుతం 10 కేటగిరీల్లో యువతీ యువకులకు శిక్షణ ఇస్తున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్, ఫ్రెంట్ ఆఫీస్ అసిస్టెంట్స్, బీపీఓ, సేవింగ్ మిషన్ ఆపరేటర్, ఎక్కౌంట్స్ ఎగ్జిక్యూటివ్స్, ఫిట్టర్ ఫేబ్రికేషన్, ఫోర్ వీలర్స్ టెక్నిక్స్‌తో పాటు మరో మూడు కేటగిరీల్లో శిక్షణ అందిస్తున్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి..**



ముఖ్యమంత్రి ఆదేశాలతో జిల్లాలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో స్కిల్ హబ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. యువత సద్వినియోగం చేసుకోవాలి. వీటిల్లో శిక్షణ పొందిన వారికి వంద శాతం ప్లేస్‌మెంట్ సౌకర్యం కల్పిస్తాం. గతంలో ఇలాంటి శిక్షణ పొందాలంటే ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు వారికి దగ్గరలోని కేంద్రాల్లోనే శిక్షణ లభిస్తోంది.
– సాయి శ్రీనివాస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి

**ప్లేస్‌మెంట్లు బాగున్నాయి..**



నేను నరసన్నపేట స్కిల్ హబ్ సెంటర్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా శిక్షణ పొందాను. బాగా శిక్షణ ఇచ్చారు. ప్లేస్‌మెంట్ కూడా వచ్చింది. ప్రస్తుతం మీరాటెక్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. ఇలాంటి అవకాశాలు మాకు ఇవ్వడం సంతోషకరం. – చిలకలపల్లి సునీత, నరసన్నపేట

# మొగదాలపాడులో దారుణ హత్య



హత్యకు గురైన చీకటి చిన్న ఎర్రయ్య

గార: మండలంలోని వత్సవలస పంచాయతీ మొగదాలపాడులో శుక్రవారం రాత్రి నడిరోడ్డుపై ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. వివరాల్లోకి వెళితే.. మొగదాలపాడు గ్రామానికి చెందిన చీకటి చిన్న ఎర్రయ్య (65)ను గ్రామ శివారులోని పాఠశాల వద్ద కొమరవానిపేటకు వెళ్లే రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తులు పదునైన ఆయుధంతో గొంతు, కళ్లపై దాడి చేసి చంపేశారు. మృతదేహం పక్కన నాలుగు మద్యం బాటిళ్లు ఉన్నాయి. ఎర్రయ్య చిల్లంగి వంటి పనులు చేస్తున్నాడని ఊరిలో అనుమానాలు ఉన్నాయని స్థానికులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే హత్య జరిగి ఉంటుందని భావిస్తున్నారు. సీఐ ఎస్.సన్యాసినాయుడు, ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు సంఘటన స్థలానికి వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. మృతుని కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. చిన్న ఎర్రయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

### ప్రభుత్వ స్థలాల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ గ్రామంలో 86 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ స్థలాలను జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ శుక్రవారం పరిశీలించారు. పొన్నాడ కొండ ప్రభుత్వ స్థలాలను రాష్ట్ర టూరి జం శాఖకు 17 ఎకరాలు, ఇస్కాన్‌కు ఐదు ఎకరాలు, శిల్పారామానికి 9.75 ఎకరాలు, మురు గు నీటి శుద్ధి కర్మాగారానికి ఐదు ఎకరాలు, అంబేడ్కర్ శిక్షణ కేంద్రానికి ఐదు ఎకరాలు కేటాయించారు. ఈ మేరకు కేటాయింపుల రికార్డులు పరిశీలించి, హద్దులు చూశారు. టూరిజానికి కేటాయించిన స్థలాలను హద్దు లు వేసి అప్పగించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. జిల్లా టూరిజం అధి కారి నడిమింటి నారాయణరావు, తహసీల్దార్ వై.సత్యనారాయణ అయన వెంట ఉన్నారు.

# పక్కాగా జనన మరణాల నమోదు



రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న డీడీ సాయిశంకర్

గార: పక్కాగా జనన మరణాల నమోదు సచివాలయ స్థాయిలో జరగాలని, నమోదుపై అప్రమత్తంగా ఉండాలని డైరెక్టరేట్ సెన్సస్ ఆపరేషన్స్ (హైదరబాద్) డిప్యూటీ డైరక్టర్ బీవీఎల్ సాయిశంకర్ అన్నారు. మండలంలోని మేజర్ పంచాయతీ శ్రీకూర్మం సచివాలయాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులతో కలసి సందర్శించారు. జనన, మరణాల నమోదు రిజిస్టర్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో ప్రసవాల నమోదుకు ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారా శిశు మరణాల సంఖ్య తగ్గుతుందన్నారు. ఆస్పత్రి ప్రసవాల ద్వారా జనన నమోదు కచ్చితత్వం ఉంటుందన్నారు. నమోదు ప్రక్రియలో నిబంధనలు తప్పకుండా పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ బి. శ్రీనివాసరావు, పంచాయతీ ఈఓ ఎ.కేశవరావు, చెట్టు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతకు మద్దతు



రైతులకు మద్దతు ధరపై అవగాహన కలిగిస్తున్న అధికారులు (ఫైల్)

- ధాన్యం క్వింటాకు రూ. 143 మద్దతు ధర పెంచిన కేంద్రం
- ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందుతున్న మద్దతు ధరలు
- పెంపుతో జిల్లాలో రైతులకు రూ.179 కోట్ల మేర ప్రయోజనం

నరసన్నపేట: కేంద్రం ఈ ఏడాదికి గాను పంటలకు మద్దతు ధరలను ప్రకటించింది. జిల్లా అధికంగా సాగవుతున్న ధాన్యంతో పాటు పలు పంటలకు మద్దతు ధరలను పెంచింది. అయితే ఇంకాస్త పెంచితే బాగుంటుందన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమైంది. గతంలో ఏడాదికి క్వింటాకు రూ. 50, రూ. 100ల పెంపుతో సరిపెట్టిన కేంద్రం ఈ సారి క్వింటాకు రూ. 143లు పెంచింది. తాజా పెంపుతో కామన్ ధాన్యం క్వింటా ధర రూ. 2183 కు చేరుకుంది. గత ఏడాది క్వింటాకు రూ. 2040 ధర ఉండేది. అలాగే గ్రేడ్ ఏ రకం ధాన్యం ధర క్వింటాకు రూ.2203 కు చేరింది. గత ఏడాదిలో గ్రేడ్ ఏ రకం ధాన్యం ధర క్వింటాల్‌కు రూ.2060 ఉండేది.

**రైతులకు ప్రయోజనం**

పెంచిన ధాన్యం మద్దతు ధరతో జిల్లాలో రైతులకు రూ. 179 కోట్ల మేరకు ప్రయోజనం కలగనుంది. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో సాధారణ వరి పంట విస్తీర్ణం 5 లక్షల ఎకరాలుగా వ్యవసాయాధికారులు భావిస్తున్నారు. గడిచిన రెండు ఖరీఫ్ సీజన్‌లతో పోల్చితే సరాసరిన ఎకరాకు దిగుబడి 25 బస్తాల వరకూ ధాన్యం దిగిబడి వస్తుంది. ప్రతి బస్తాకు రూ. 143 మేరకు కేంద్రం మద్దతు ధర పెంచడంతో రూ.179 కోట్ల మేరకు రైతులకు ప్రయోజనం కలగనుంది.

**మద్దతు ధరలు ఇలా..**

కేంద్ర ప్రభుత్వం వరి ధాన్యంతో పాటు ఇతర పంటలకూ మద్దతు ధరలను ప్రకటించింది. పెసర రూ. 803, మినుము రూ. 350లు, మొక్కజొన్న రూ. 128 లు, నువ్వులు రూ.805ల మేరకు పెంచింది. దీంతో మొక్కజొన్న రూ. 2090, పెసర రూ.8558, మినుములు రూ.6950, నువ్వులు 8635లకు క్వింటా ధర చేరింది. అలాగే రాగులు రూ. 268 లు, వేరు శనగ రూ. 527ల మేరకు పెంచింది.

**మరింత పెంచితే బాగుండేది**



వరి పంటలో పెట్టుబడులు బాగా పెరిగాయి. ఎరువుల ధరలు కేంద్రం పెంచింది. దీంతో తాజాగా కేంద్రం ప్రకటించిన ధాన్యం మద్దతు ధరల పెంపుపై రైతుల్లో మిశ్రమ స్పందన వస్తుంది. క్వింటాకు రూ. 250 వరకూ పెంచితే బాగుండేది. రైతులకు కొంత మేరకు ఊరటగా ఉండేది. అయితే రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల రైతులకు మద్దతు ధరలు పూర్తి స్థాయిలో అందుతున్నాయి. ఇది రైతులకు చాలా వరకూ మేలు చేస్తుంది.
– పంగ బావాజీ నాయుడు, రైతు, నర్సింగపల్లి

**మద్దతు ధర అందుతోంది**



వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారానికి వచ్చిన తర్వాత ధాన్యంకు మద్దతు ధర సక్రమంగా రైతులకు అందుతోంది. గతంలో మద్దతు ధర ప్రకటనలకే తప్ప రైతులకు అందేది కాదు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో విక్రయాలు సజావుగా జరుగుతున్నాయి.
– ఎస్.తవిటినాయుడు(శ్రీను) రైతు, లుకలాం

# రక్తదాతలకు అభినందనలు



అంబుగాంలో రక్తదాతలను అభినందిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

మందస: సమాజ హిత కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం కావాలని రాష్ట్ర పశు సంవర్థక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని అంబుగాంలో శుక్రవారం జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ సమాజ చైతన్య కార్యక్రమాలను చేపట్టి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిక్కోలు ఉద్దానం సేవాసమితి చేస్తున్న సమాజ సేవ అభినందనీయమన్నారు. కిడ్నీవ్యాధి బాధితులకు అంబులెన్స్ ఏర్పాటు చేయడం ముదావహమని, ఈ సందర్భంగా అంబులెన్స్‌ను ప్రారంభించారు. రక్తదాన శిబిరాన్ని సందర్శించి, దాతలను అభినందించారు. అనంతరం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బడుల ప్రారంభం రోజునే కానుకల పంపిణీ



ఎంఈఓకు సూచనలు చేస్తున్న డీఈఓ తిరుమల చైతన్య

నరసన్నపేట: విద్యార్థులకు పాఠశాలల ప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుక కిట్లు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈఓ తిరుమల చైతన్య తెలిపారు. స్థానిక బోర్డు స్కూల్లో విద్యా కానుక కిట్లు, పాఠ్యపుస్తకాల సరఫరాపై ఎంఈఓ శాంతారావుతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ స్కూల్స్‌లో జూన్ 12న జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే అన్ని పాఠశాలలకు కిట్లు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తామని తెలిపారు. నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 90 శాతం స్కూల్స్‌కు కిట్లు వెళ్లాయని మిగిలిన స్కూల్స్‌కు కూడా పంపించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

# ‘గృహ నిర్మాణాలు ప్రారంభించాలి’



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ నర్సింగరావు

పాతపట్నం: ఇంటి నిర్మాణాలను త్వరితగతిన లబ్ధిదారులు ప్రారంభించాలని గృహ నిర్మాణ శాఖ డీఈ వి.నర్సింగరావు అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న బీసీ కమ్యూనిటీ హాల్‌లో జగనన్న కాలనీ ఇళ్ల పట్టాల లబ్ధిదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఎవరికి కేటాయించిన ఇంటి స్థలంలో వారు ఇళ్ల నిర్మాణాలు చేపడితే సకాలంలో బిల్లులు వేస్తామని చెప్పారు. జగనన్న లేవుట్‌లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇంటింటికి తాగునీరు, సీసీ రహదారులు, కాలువలు వంటి సౌకర్యాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎం.కరుణాకరరావు, హౌసింగ్ ఏఈ భాస్కరరావు, ఆలయ కమిటీ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, వైస్ఎంపీపీ ఎస్.ప్రదీప్, ఎంపీటీసీ కె.యరకయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు శిర్ల జోగారావు, జి.రాము, సచివాలయ ఇంజినీర్లు కృష్ణ, నవీన్, సచివాల ఉద్యోగులు, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### యువకుడు అదృశ్యం



రామిశెట్టి జయసూర్య

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళంలోని నానుబాలవీధిలో ఓ యువకుడు అదృశ్యమైనట్లు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపారు. షుగర్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న రామిశెట్టి హరినాథ్, కల్పన దంపతులకు డిగ్రీ పూర్తి చేసిన కుమారుడు జయసూర్య (23) ఉన్నాడు. జయసూర్య బ్యాంకు జాబ్‌లకు ప్రిపేరవుతున్నాడు. తల్లిదండ్రులు మందలించడంతో ఈ నెల 1న రాత్రి పదిగంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. తల్లి కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

# క్రీడాస్ఫూర్తి ముఖ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని రాష్ట్ర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎం.విజయ్‌కుమార్ అన్నారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ ఎస్ఎం పురం క్యాంపస్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే ఇంటర్ క్యాంపస్ పురుషుల క్రీడల పోటీలు శుక్రవారం ప్రారంభించారు. ఈ క్రీడల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఒక్కో క్రీడలో శ్రీకాకుళం, ఇడుపులపాయ, నూజివీడు, ప్రకాశం నుంచి మొత్తం నాలుగు జట్లు పాల్గొంటాయి. ఉత్తమ క్రీడా ప్రదర్శన ఆధారంగా ఆర్‌జీయూకేటీ నుంచి జాతీయ స్థాయి, సౌత్ జోన్ విశ్వవిద్యాలయాల్లో ఆడే జట్లను ఎంపిక చేస్తారు. పోటీలను వీసీ ప్రారంభించి మాట్లాడారు. ట్రిపుల్ ఐటీలో చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ కొర్ల మోహన్ కృష్ణ చౌదరి, ఆర్‌జీయూకేటీ స్పోర్ట్స్ సెక్రటరీ షంషాద్ బేగం పాల్గొన్నారు.



క్రీడాకారులతో వైస్ చాన్స్‌లర్ విజయ్‌కుమార్, అధికారులు

## ‘అట్టాడ’కు బలివాడ జీవన సాఫల్య పురస్కారం



అట్టాడ అప్పలనాయుడు రచయిత

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ కథా, నవలా రచయిత అట్టాడ అప్పలనాయుడు బలివాడ కాంతారావు స్మారక జీవన సాలఫల్య పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు విశాఖ భారత నిధి ఫౌండేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. జూలై 7న ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. అట్టాడతోపాటుగా చాగంటి తులసి(విజయనగరం), 2022కు డాక్టర్ తుర్లపాటి రాజేశ్వరి(బరంపురం), డాక్టర్ చింతికింది శ్రీనివాసరావు(చోడవరం) ఈ అవార్డులకు ఎంపికయ్యారు. విజయనగరం జిల్లా గుమడలో జన్మించిన అప్పలనాయుడు గ్రామీణ బ్యాంకులో ఆఫీసర్‌గా పనిచేసి రిటైరయ్యారు. ఈయన రచనలు వివిధ పత్రికల్లో 100కు పైగా ప్రచురితమయ్యాయి. 5 కథాసంపుటాలు, 5 నవలలు, ఇవికాక 2013లో ఎంపిక చేసిన కథలు 33తో కథాసంపుటి, పునరావాసం, ఉత్కళం, అనగనగా ఒక రాజద్రోహం, సూకలిస్తాను నవలలు, సూర్య దినపత్రికలో ‘నేస్తం ఊసులు’ కాలమ్ రాశారు. ఇదీసంగతి అనే ధారావాహికం నాటిక 13 వారాలు ప్రసారమైంది. ‘మడిసెక్క’ నాటకం అఖిలభారతస్థాయి రేడియో నాటిక పోటీల్లో ప్రథమ బహుమతి పొందింది. శ్రీకాకుళ సాహితీ వ్యవస్థాపక కారదర్శిగా, కథానిలయం ట్రస్టు బోర్డు సభ్యులుగా ఉన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం సలహామండలి సభ్యులుగా ఉన్నారు. అలాగే ఉత్తరాంధ్ర రచయితలు, కళాకారుల వేదిక అధ్యక్షులుగానూ వ్యవహరిస్తున్నారు.

### బులియన్

| విశాఖపట్నం | |
|---|---|
| బంగారం(24క్యా. 10గ్రా.) | 60,650–00 |
| బంగారం(22క్యా. 10గ్రా.) | 55,600–00 |
| వెండి (కిలో) | 77,000–00 |

### కోడిగుడ్ల ధరలు

| హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు) | |
|---|---|
| విశాఖపట్నం | రూ. 515.00 |
| విజయనగరం | రూ.519.00 |
| శ్రీకాకుళం | రూ.519.00 |

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹180 | ₹315 | ₹ 335 |